
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 3

శనివారం 22 జూన్ 2024





ప్రణామం.. ప్రమాణం..

- చంద్రబాబు సారథ్యాన కొలువుదీరిన అసెంబ్లీ
- ప్రమాణ స్వీకారం చేసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- ముందుగా మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఫరూక్
- కుటుంబ సభ్యులు, సహచరులతో సందడి



బీవీ జయ నాగేశ్వర రెడ్డి



బొగ్గుల దస్తగిరి



కేఈ శ్యాంబాబు



పార్థసారథి



బాలనాగి రెడ్డి



విరుపాక్షి



కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి



గౌరు చరిత



బుడ్డా రాజశేఖర రెడ్డి



భూమా అఖిలప్రియ



జయ సూర్య









ప్రమాణ స్వీకారం చేస్తున్న మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్

కర్నూలు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో చంద్రబాబు సారథ్యాన శాసనసభ శుక్రవారం కొలువుదీరింది. సభా నాయకులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ సహా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి చేరుకున్నారు. వారి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, సహచరులు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. ముందుగా నిర్ణయించిన శుభ ముహుర్తానికి సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తూ ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాన్ని టీవీల్లో వీక్షిస్తూ ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన టీడీపీ శ్రేణులు, అనుచరగణాలు సంబరాలు చేసుకున్నాయి. అసెంబ్లీలో సమస్యలపై గళం విప్పుతాం.. నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని తమ మనోగతాన్ని వెల్లడించారు.

ముందుగా మంత్రులు...

సభా నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ చేత ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎమ్మెల్యేగా ప్రమాణాస్వీకారం చేయించారు. ఆ తరువాత మంత్రులు ఒక్కొక్కరిగా ప్రమాణం చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ ప్రమాణ స్వీకారం చేశారు. తరువాత అక్షర క్రమంలో ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలో టీడీపీకి చెందిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి, వైసీపీకి చెందిన మంత్రాలయం ఎమ్మెలే వై.బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో బాలనాగిరెడ్డి నాలుగో సారి, బీవీ జయనాగేశ్వరరెడ్డి రెండో సారి ప్రమాణ స్వీకారం చేస్తే.. మిగిలిన ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. నంద్యాల పార్లమెంట్ నుంచి టీడీపీ ఎమ్మెల్యేలు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మూడవ పర్యాయం, ఆళ్లగడ్డ, శ్రీశైలం ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలు రెండవసారి ప్రమాణ స్వీకారం చేస్తే.. డోన్, నందికొట్కూరు ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. అయితే.. కోట్ల మూడు పర్యాయాలు ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన చరిత్ర ఉంది.



అసెంబ్లీలో తనకు కేటాయించిన సీటులో కూర్చున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ప్రగతి సాధిస్తాం

అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టడం ఆనందంగా ఉందని వివరించారు. తొలిసారిగా గెలిచి అసెంబ్లీకి వెళ్లిన కొత్త ఎమ్మెల్యేలు సంతోషం మాటల్లో చెప్పలేమని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సమస్యలపై అసెంబ్లీలో వినిపిస్తాం.. అదే క్రమంలో మా అధినేత, సీఎం చంద్రబాబు, సంబంధిత మంత్రులు దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గంలో ప్రగతి చేసి చూపిస్తాం అని పేర్కొన్నారు. అదే క్రమంలో ప్రమాణ స్వీకరం అనంతరం అసెంబ్లీలోనూ, బయట కుటుంబ సభ్యులు, అనుచరులు, సహచర మిత్రులతో కలసి సందడి చేశారు. వెలగడిపూడి అసెంబీ, సచివాలయాల వద్ద ఫొటోలు దిగారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేసిన వారు చంద్రబాబుతో పాటు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరికి అభివాదం చేశారు.



ప్రొటెం స్పీకర్‌తో మంత్రి ఎన్ఎండీ ఫరూక్



అసెంబ్లీలో సహచర ఎమ్మెల్యేలతో కలసి కూర్చున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి



యోగా సాధనలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు
- జిల్లా వ్యాప్తంగా యోగా దినోత్సవం
- సామూహిక యోగా సాధన చేసిన అధికారులు, ప్రజలు

నంద్యాల (కల్చరల్), జూన్ 21: దినచర్యలో యోగా భాగస్వామ్యం అయితే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శారీరక, మానసిక ఒత్తిళ్లను జయించవచ్చని కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప సంపద యోగా అని, ఆరోగ్య సంరక్షణకు యోగాను మించిన మార్గం మరొకటి లేదన్నారు. శుక్రవారం పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా వివిధ సంస్థల నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాభ్యాసనాలు, ధ్యానం, ప్రాణాయామం వంటివి ఆచరించారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని అన్నారు. నంద్యాల పద్మావతీ నగర్‌లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ కె.శ్రీనివాసులు, జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. శాంతినికేతన్ సీబీఎస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవానికి ఎస్పీ రఘువీర్ రెడ్డి హాజరయ్యారు. యోగాసాధకులు, పాఠశాల విద్యార్థులతో సామూహికంగా యోగసనాలు, కపాలభాతి, ప్రాణాయామం, ధ్యానం వంటి కార్యక్రమాలు చేయించారు.

యోగా సాధన తప్పనిసరి: ఎస్పీ

నంద్యాల క్రైం: నిత్యజీవితంలో యోగా సాధన తప్పనిసరిగా చేసుకోవాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితం పతంజలి మహర్షి ఎంతో ముందుచూపుతో సమాజాన్ని, ఆరోగ్యాన్ని, భావితరాలు బాగుండాలనే ఉద్దేశంతో యోగా అనే చక్కటి ప్రక్రియను ప్రారంభించారన్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు యోగా చేయడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. దేశ సంప్రదాయంలో యోగా ఒక భాగమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రాణాయామం చేస్తున్న కలెక్టర్, జేసీ



చాబోలులో 20 మందికి అతిసార

- ప్రైవేటు వైద్యశాలకు తరలింపు
- మంచినీటి ట్యాంకులో పక్షుల కళేబరాలు
- ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన డీపీవో



ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకుని వచ్చిన లింగస్వామి పిల్లలు

జూపాడుబంగ్లా, జూన్ 21: మండలంలోని పోతులపాడు మంజురా గ్రామం చాబోలులో గురువారం రాత్రి నుంచి అతిసారంతో 20 మంది అస్వస్థతకు గురయ్యారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో రాత్రికి రాత్రే నందికొట్కూరు, ఆత్మకూరు, పాములపాడు ప్రాంతాల్లో ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. మంచినీటి ట్యాంకుల్లో చెత్తాచెదారంతోపాటు కోళ్ల, పక్షుల కుళ్లిపోయిన కళేబరాలు నీళ్లపైన తేలియాడుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. అస్వస్థతకు గురైన వారిలో 15 మంది వరకు చిన్నారులే ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. హణి, రాజు, దక్షిత్, రోహిత్, సాయి అనే చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నందికొట్కూరు, కర్నూలు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. మరికొందరు నందికొట్కూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారు. అతిసారం సోకిన వారిలో రుషి, అభిషేక్, లింగస్వామి, శ్వేత, మమత, నవీన్, నరేంద్ర, ధాత్రి, రోహిత్ అనే చిన్నారులతోపాటు మరియమ్మ, నాగన్న, రాజు, సుకంకన్న, చిట్టెన్న, మరికొందరు ఉన్నారు. విషయం తెలుసుకున్న డీపీవో మంజులవాణి గ్రామాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు నిర్లక్ష్యమని విచారణలో తేలగా పంచాయతీ కార్యదర్శి ఈవోఆర్డీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని అన్నారు.



మంచినీటి ట్యాంకులో కుళ్లిపోయిన పక్షుల కళేబరాలు

ఇసుక పంచాయితీ..!



- ఏపీ భూ భాగంలోకి చొరబడిన ఇసుకాసురులు
- అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా
- అడ్డుకున్న ఆర్.కొంతలపాడు, సుంకేసుల రైతులు
- మూడేళ్లుగా సాగుతున్న దందా
- స్పందనలో ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం
- జరిమానాతో సరిపెట్టిన అధికారులు
- గతంలో మునగాలపాడు వద్ద ఇదే తరహా వివాదం

కర్నూలు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి)/కర్నూలు రూరల్:

తుంగభద్ర నదిలోని ఆంధ్రప్రదేశ్ భూభాగం అది. కర్నూలు, కపడ జిల్లాల రైతుల జీవనాడి అయిన సుంకేసుల జలాశయానికి అతి సమీపంలో ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామాల దగ్గర నాణ్యమైన ఇసుక నిల్వలు ఉన్నాయి. డ్యాం భద్రత, తాగు, సాగునీటి పథకాల సంరక్షణ దృష్ట్యా ఏపీ ప్రభుత్వం అక్కడ ఇసుక రీచ్‌లకు అనుమతి ఇవ్వలేదు. నది ఆవలి ఒడ్డున తెలంగాణ ప్రభుత్వం తూర్పు గార్లపాడు వద్ద ఇసుక రీచ్‌కు అనుమతి ఇచ్చింది. ఆ ముసుగులో ఏపీలో ఉన్న ఇసుకపై కన్నేసిన తెలంగాణ ఇసుకాసురులు అనుమతి పేరిట అక్రమ తవ్వకాలకు సై అన్నారు. మూడేళ్లుగా అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. స్పందనలో ఆయా గ్రామాల రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. శుక్రవారం పదుల సంఖ్యలో తెలంగాణ ట్రాక్టర్లు తమ సరిహద్దు దాటి ఏపీ పరిధిలోని తుంగభద్ర నదిలోకి చొచ్చుకు రావడం చూసిన ఆర్.కొంతలపాడు, సుంకేసులు గ్రామాల రైతులు అడ్డుకున్నారు. జిల్లా కలెక్టరు డాక్టరు జి.సృజన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు వాస్తవమేనని నిగ్గుతేల్చారు. జరిమానాతో సరిపెట్టారు. మరోసారి తెలంగాణ గ్రామాల వ్యక్తులు ఏపీ భూభాగంలోకి ఇసుక కోసం చొరబడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతుల ఫిర్యాదుతో కదిలిన అధికారులు

జిల్లాలో ఏపీ భూ భాగంలో చొరబడి తెలంగాణకు చెందిన వ్యక్తులు పదుల సంఖ్యలో ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే.. ఆర్.కొంతలపాడు సర్పంచ్ కె.మహానంది, సుంకేసులు మాజీ ఎంపీటీసీ కె.శ్రీరాములుతోపాటు పలువురు రైతులు తెలంగాణ ఇసుక ట్రాక్టర్లు, తవ్వకాలను అడ్డుకున్నారు. జిల్లా కలెక్టరు డాక్టరు జి.సృజనకు ఫిర్యాదు చేశారు. మంత్రి టీజీ భరత్, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలు ఈ విషయాన్ని జిల్లా కలెక్టరు డాక్టర్ సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్‌ల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టరు ఆదేశాల మేరకు కర్నూలు రూరల్ తహసీల్దారు రామాంజులనాయక్, తాలుకా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీధర్, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్, వీఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏపీ భూభాగంలో ఇసుక ఇసుక అక్రమంగా తవ్వకాలు వాస్తవమేనని నిర్ధారించారు. ఇసుక రవాణా చేస్తున్న 51 ట్రాక్టర్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ వైపు నుంచి రాజోలి మండలం తహసీల్దారు, ఎస్‌ఐలు కూడా అక్కడికి చేరుకున్నారు. తుంగభద్ర నదిలో సరిహద్దులను పరిశీలించి ఏపీ సరిహద్దులో ఇసుక తవ్వకాలు నిజమేనని నిగ్గుతేల్చారు.



తుంగభద్ర వద్ద ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామస్థులు

రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం

జిల్లాలో కర్నూలు రూరల్ మండలం ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామాలు, తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం రాజోలి, చిన్న దనవాడ, తుమ్మలపల్లె, రాజోలి, తూర్పు గార్లపాడు గ్రామాల మధ్య తుంగభద్ర నది ప్రవహిస్తుంది. నదిపై ఇరు రాష్ట్రాలకు హక్కు ఉంది. అయితే.. ఏ రాష్ట్రం భూ భాగంలో ఉన్న ఇసుకను ఆ రాష్ట్రం గ్రామాల ప్రజలు తమ అవసరాల కోసం వినియోగించుకోవాలి. ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామాల సమీపంలో తుంగభద్ర నది ఏపీ భూ భాగం పరిధిలో నాణ్యమైన ఇసుక నిల్వలు ఉన్నాయి. అయితే.. ఈ నిల్వలకు అతి సమీపంలో సుంకేసుల డ్యాంతోపాటు తాగునీరు, సాగునీటి పథకాలు ఉండడంతో ఇసుక రీచ్‌లకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. నది ఆవలి ఒడ్డున తెలంగాణ ప్రభుత్వం రాజోలి మండలం తూర్పు గార్లపాడు గ్రామం వద్ద తుంగభద్ర నదిలో ఇసుక రీచ్‌కు అనుమతి ఇచ్చింది. ఆ రాష్ట్ర భూ భాగంలో ఇసుక తవ్వకాలు చేస్తే ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేదు. తెలంగాణ భూ భాగంలో ఇసుక నిల్వలు ఖాళీ అయినా.. ఆ రాష్ట్ర శాండ్ యాప్‌లో రాయల్టీ చెల్లించి.. ఆ ముసుగులో కర్నూలు జిల్లాలోని ఏపీ భూ భాగంలోకి చొరబడి అక్రమంగా ఇసుక తవ్వకాలు మూడేళ్లుగా తెలంగాణ వ్యక్తులు సాగిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాలని ఆర్.కొంతలపాడు, సుంకేసుల గ్రామాల రైతులు పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. కారణం.. తెలంగాణ ఇసుక అక్రమార్కులకు కర్నూలు జిల్లాకు చెందిన కొందరు వైసీపీ నాయకులు, అధికారుల అండ ఉండడమే.

రెండు జిల్లాల కలెక్టర్ల చర్చలతో వివాదానికి తెర

కర్నూలు జిల్లా కలెక్టరు డాక్టరు జి.సృజన, తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరు బీఎం సంతోష్‌లు ఈ వివాదంపై చర్చించారు. భవిషత్తులో ఈ సమస్య మళ్లీ ఉత్పన్నం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని గద్వాల జిల్లా కలెక్టరును కర్నూలు జిల్లా కలెక్టరు కోరారు. అందుకు ఆ కలెక్టరు సానుకూలంగా స్పందించారు. ధనాపేక్షతో స్వార్థపరులు సాగించిన ఇసుక తవ్వకాలు కారణంగా అంతర్ రాష్ట్ర సరిహద్దు వివాదం తలెత్తకుండా ఇరు జిల్లాల కలెక్టరు తీర్ణయం తీసుకోవడంతో ఈ వివాదానానికి తెర పడింది. అనుమతి పేరిట ఏపీ భూ భాగంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న తెలంగాణకు చెందిన ఒక్కో ట్రాక్టరు యజమాని నుంచి రూ.5 వేల జరిమానా వసూలు చేశారు. ముున్ముందు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఇసుక నిల్వలు ఉన్న ప్రాంతాల్లో సరిహద్దు సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయాలని, అప్పటికీ వాటిని దాటి వచ్చి ఇసుక తవ్వకాలు సాగిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు పేర్కొన్నారు.



రాష్ట్ర సరిహద్దులో ట్రాక్టర్లతో వస్తున్న తెలంగాణ వాసులు



ఆంధ్ర సరిహద్దు నుంచి తరలిస్తుండగా అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

గతంలోనూ సరిహద్దు వివాదాలు

తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలపై గతంలోనూ ఇరు రాష్ట్రాల గ్రామాలకు చెందిన ఇసుక రవాణాదారుల మధ్య సరిహద్దు వివాదాలు తలెత్తాయి. కర్నూలు మండలం మునగాలపాడు, తెలంగాణలోని మానవపాడు మండలం కల్లూరు, కలుగోట్ల గ్రామాల ఇసుక రవాణాదారుల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ కూడా జరిగింది. అదే క్రమంలో కౌతాళం మండలం మరళి వద్ద ఏపీ సరిహద్దులోని ఇసుక రీచ్‌లోకి.. నది అవలి ఒడ్డున ఉన్న కర్ణాకట రాష్ట్రానికి చెందిన వ్యక్తులు చొరబడి ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వకాలు చేస్తుంటే గుర్తించిన జిల్లా అధికారులు కేసులు నమోదు చేశారు.

తుంగభద్రలో సరిహద్దులు ఏర్పాటు చేశాం



ఆర్.కొంతలపాడు, సుంకేసుల దగ్గర తెలంగాణ వ్యక్తులు ఏపీ భూ భాగంలో ఇసుక తవ్వకాలు చేసి రవాణా చేస్తున్నారని కలెక్టరు డాక్టర్ జి.సృజనకు ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టరు ఆదేశాల మేరకు తనిఖీ చేశాం. తెలంగాణ రాష్ట్రం తూర్పు గార్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తులు 100 మీటర్లకు పైగా ఏపీ భూ భాగంలోకి వచ్చి ఇసుక తవ్వకాలు చేసినట్లు గుర్తించి 51 ట్రాక్టర్లు అదుపులోకి తీసుకున్నాం. ఒక్కో ట్రాక్టరు నుంచి రూ.5 వేలు అపరాద రుసుం వసూలు చేశాం. ఈ సమస్య మళ్లీ తలెత్తకుండా సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేశాం.

– రామాంజుల నాయక్, తహసీల్దార్, కర్నూలు రూరల్:

స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



సుంకేసుల ప్రాజెక్టుకు దిగువన డ్యాం సమీపంలో మన భూ భాగం తుంగభద్ర నదిలో ఇసుక నిల్వలు ఉన్నాయి. ఆవలి ఒడ్డున తెలంగాణ గ్రామాల వ్యక్తులు అక్రమంగా ఇసుకను తవ్వేస్తున్నారు. ఐదారు గ్రామాల సర్పంచులు, రైతులు గతంలో స్పందనలో ఫిర్యాదులు చేసినా, జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. మూడేళ్లుగా ఈ భాగోతం సాగుతుంది. ఇక్కడి వైసీపీ నాయకులు కొందరు, పోలీసు అధికారుల అండతోనే తెలంగాణ వ్యక్తులు రెచ్చిపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టరు సృజన స్పందించడం అభినందనీయం.

– కె.మహానంది, ఆర్.కొంతలపాడు సర్పంచ్,

డ్యామ్‌కు ప్రమాదం పొంచి ఉంది



కరువు పల్లె జీవనాడి సుంకేసులు ప్రాజెక్టు. ఈ డ్యాంకు అతి సమీపంలో ఏపీ పరిధిలో తెలంగాణకు చెందిన వ్యక్తులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇసుక నిల్వలు ఉన్న ప్రాంతంలోనే దేవమ్మ మడుగు ఉంది. ఒకప్పుడు కర్నూలు ప్రజల దాహం తీర్చింది. తెలంగాణ వ్యక్తులు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటి పథకాలు ఒట్టిపోయే ప్రమాదం ఉంది. సుంకేసుల డ్యాంకు కూడా ముప్పు పొంచి ఉంది.

– కె.శ్రీరాములు, సుంకేసులు మాజీ ఎంపీటీసీ, కర్నూలు మండలం

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి

నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ



సమీక్షలో ఏడీఆర్, డీఏవోలు

నంద్యాల టౌన్, జూన్ 21 : వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ అన్నారు. శుక్రవారం ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ - సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్‌లో పంటల విస్తీర్ణం, పంటల సాగులో చేపట్టాల్సిన వివిధ యాజమాన్య పద్ధతులు, వివిధ పంటల్లో అత్యధిక దిగుబడి ఇచ్చే వంగడాలు, పంటల సరళి, తదితర అంశాలపై ఏడీఆర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. కర్నూలు జిల్లా వ్యవసాయాధికారి సురేష్ మాట్లాడుతూ జిల్లాలో 140 హెక్టార్లలో మొక్కజొన్న, 155 హెక్టార్లలో సజ్జ, 902 హెక్టార్లలో కంది, 165 హెక్టార్లలో మినుము, 2798 హెక్టార్లలో వేరుశనగ, 24816 హెక్టార్లలో పత్తి, 192 హెక్టార్లలో మిరపను రైతులు సాగు చేశారని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, మినుము, కంది, పొగాకు, వేరుశనగ పంటలను 23 వేల హెక్టార్లలో సాగు చేశామని అన్నారు. సాధారణ వర్షపాతం నమోదైందని, అందుకు అనుగుణంగా వివిధ డివిజన్‌లలో సాగు చేసిన పంటల విస్తీర్ణం, వర్షపాతం నమోదు వివరాలను వెల్లడించారు. వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ఎన్‌డీఎల్ఆర్ -7, ఎంటీయూ -1271, బీపీటీ - 2846 రకాలు అగ్గి తెగుళ్లను తట్టుకొని, గాలి, వానలకు గింజ రాలకుండా అధిక దిగుబడిని ఇచ్చే రకాలను రైతులు ఎంపిక చేసుకోవాలని అన్నారు. పొగాకు శాస్త్రవేత్త డాక్టర్ ఫుల్లిబాయి మాట్లాడుతూ పొగాకు నారు పోసుకోవడానికి జూలై 2వ వారం, నారు నాటుకోవడానికి ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 15 వరకు అనుకూలమని తెలిపారు. పత్తి శాస్త్రవేత్తలు డాక్టర్ మోహన్‌కృష్ణ, డాక్టర్ లక్ష్మీకళ్యాణి, డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేయాల్సిన రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యవసాయాధికారులు, సిబ్బంది, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సస్పెన్షన్ ఎత్తివేత

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 21: 2024 సార్వత్రిక ఎన్నికల్లో విధులకు గైర్హాజరైన ఉద్యోగ ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి.

'మాన్‌సూన్' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 21: వాణిజ్య బ్యాంకులకంటే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖల్లో రైతులతో పాటు ఇతర వర్గాల ప్రజల జీవనోపాధి, పంటల సాగుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతోందని కృష్ణానగర్ సహకార బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు సహకార బ్యాంకుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. సహకార బ్యాంకును అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా మాన్‌సూన్ డిపాజిట్ పథకాన్ని 444 రోజుల కాలపరిమితికి లోబడి అమలు చేయడం జరుగుతోందన్నారు. ఈ డిపాజిట్ పథకం వల్ల సీనియర్ సిటిజన్లకు 8.8 శాతం వడ్డీ, అదేవిధంగా 60ఏళ్లలోపు వారికి 8.30 శాతం వడ్డీని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

టీడీపీ నేత హత్య కేసులో మరో ఆరుగురి అరెస్టు

వెల్దుర్తి, జూన్, 21: వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె టీడీపీ కార్యకర్త గిరినాథ్ చౌదరి హత్య కేసులో మరో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. ఎన్నికల సందర్భంగా టీడీపీ-వైసీపీ వర్గాల నడుమ చోటుచేసుకున్న వివాదం మే 13న హత్యకు దారి తీసిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన మోదుపల్లి గిరినాథ్ చౌదరి తన తమ్ముడు కళ్యాణచక్రవర్తితో కలిసి దళితవాడ వైపు వెళ్తున్న సమయంలో వైసీపీ వర్గీయులు వేటకొడవళ్లతో దాడి చేశారు. గిరినాథ్‌చౌదరి అక్కడికక్కడే మృతిచెందగా ఆయన తమ్ముడు కళ్యాణచక్రవర్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు 16 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా గత వారంలో ప్రధాన నిందితులైన ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సామూహిక మరుగుదొడ్డిని తొలగించి ఇంటి నిర్మాణం

- శివవరంలో వైసీపీ నాయకుల దుశ్చర్య
- నిరసనకు దిగిన మహిళలు

అవుకు, జూన్ 21: అవుకు మండలం శివవరం గ్రామం ఎస్సీ కాలనీలోని సామూహిక మరుగుదొడ్డిని కూల్చివేసి వైసీపీ నాయకులు ఏకంగా ఇంటిని నిర్మించుకున్నారు. దీంతో శుక్రవారం గ్రామానికి చెందిన మహిళలు కనకమ్మ, మరియమ్మ, రాణి, భారతి, భాగ్యలత, రత్నమ్మ తదితరులు నిర్మాణం జరుగుతున్న ఇంటి ముందే నిరసనకు దిగారు. మరుగుదొడ్డిని తొలగించి ఆ స్థానంలో ప్రభుత్వ కార్యాలయాన్ని నిర్మిస్తామని వైసీపీ నాయకులు నమ్మబలుకుతూ వచ్చారు. రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తీసుకవచ్చి 2023 మార్చి 10వ తేదీన అవుకు తహసీల్దార్‌తో గ్రామానికి చెందిన గుత్తి లళితమ్మ పేరు మీద పొజిషన్ సర్టిఫికేట్ తీసుకున్నారు. పంచాయతీ కార్యాదర్శితో ఎలాంటి అప్రూవల్ తీసుకోకుండా ఇంటి నిర్మాణం చేపట్టారు. దాదాపు 90శాతం ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. వైసీపీ అధికారంలో ఉండటంతో బాధిత మహిళలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి టీడీపీ అధికారంలోకి రావటంతో గ్రామ పెద్దల సహకారంతో మహిళలు తరలివచ్చి నీళ్ల చెంబులు చేత పట్టుకొని నిరసనకు దిగారు. బహిర్భూమికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పట్టనట్లు వ్యవహరించటం వైసీపీ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. అయితే అప్పటికే గుత్తి లళితమ్మ కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తీసుక వచ్చింది. బాధిత మహిళలు పంచాయతీ సెక్రటరీ మునీరాకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయటంతో ఇంటి నిర్మాణం జరుపుతున్న గుత్తి లళితమ్మకు ఈ నెల 11వ తేదీన నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇరువర్గాల మహిళలు వాదోపవాదాలకు దిగటంతో ఎస్ఐ కిరణ్‌బాబు శివవరం చేరుకొని ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలని గుత్తి లళితమ్మను హెచ్చరించారు. ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించి బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ ముందు హాజరు పరచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



మరుగుదొడ్డి స్థానంలో నిర్మించిన ఇంటి వద్ద నిరసనకు దిగిన మహిళలు

బాలల వసతి గృహం తనిఖీ



పరిశీలన గృహంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(లీగల్), జూన్ 21: స్థానిక బాలల వసతి గృహం, వన్‌స్టాప్ సెంటర్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను ఆయన పరిశీలించి అక్కడ ఉన్న వారికి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ యాక్టు ద్వారా మహిళలకు, పిల్లలకు ఉచిత న్యాయ సహాయాన్ని తాము అందజేస్తామన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ, జూనియర్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుబ్బయ్య, న్యాయవాది బి.లక్ష్మీనారాయణ, పరిశీ లన గృహం సూపరింటెండెంట్ హుశేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

భర్తతోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదు

బేతంచెర్ల, జూన్ 21: మండలంలోని ఆర్.కొత్తపల్లి గ్రామానికి చెందిన తలారి కవితను భర్త రమేష్, మరో ముగ్గురు అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప శుక్రవారం తెలిపారు. మూడేళ్ల క్రితం గోస్పాడు మండలం ఆలమరు రమేష్‌తో కవితకు వివాహమైంది. వీరి కాపురం కొంత కాలంగా సవ్యంగా సాగింది. వివాహ సమయంలో కట్నకానుకలను కవిత తల్లిదండ్రులు అందజేశారు. అయితే భర్త రమేష్, మామ వెంకటేశ్వర్లు, అత్త తిరుపాలమ్మ, బావ చంద్రశేఖర్ అదనపు కట్నం తీసుకు రావాలని కవితను తరచూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.

అవుకులో చోరీ

అవుకు, జూన్ 21 : అవుకు పట్టణం అమ్మశాల ఆలయం సమీపంలోని షణ్ముఖ ఫ్యాన్సీ దుకాణంలో శుక్రవారం తెల్లవారు జామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. దుకాణం షట్టరు తాళాలు పగులగొట్టి దాదాపు రూ.3 లక్షల విలువ చేసే సిగరెట్ బండిల్స్, రూ.80 వేల నగదును దోచుకెళ్లినట్లు బాధితుడు పసుపల సుబ్రమణ్యం తెలిపారు. ఎస్ఐ కిరణ్‌బాబు పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ఆత్మకూరు, జూన్ 21: ఆత్మకూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఈ నెల 17వ తేదీన చోటు చేసుకున్న షేక్ ఖాదర్‌వలి(20) హత్య కేసు నిందితుడు గువ్వలకుంట్ల ఫరూక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆత్మకూరు మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన ముర్తుజావలి, హుసేన్‌బాషా, ముజీబ్, ఆత్మకూరుకు చెందిన షేక్షావలి, రఫీక్, రసూల్, కురుకుందకు చెందిన ఫరూక్ అందరూ హైదరాబాద్‌లో ఖవ్వాబన్ వ్యాపారం చేస్తూ ఈ నెల 16వ తేదీన ఆత్మకూరుకు టాటాఏసీ వాహనంలో బయలుదేరారు. వాహనం ముందు సీటులో కుర్చునే విషయంలో ముర్తుజావలికి, ఫరూక్ మధ్య వివాదం జరిగింది. ఈ నేపథ్యంలోనే 17వ తేదీ రాత్రి 9.30గంటల సమయంలో ముర్తుజావలికి ఫరూక్ ఫోన్ చేసి నానా విధాలుగా దుర్భాలాషలాడారు. దీంతో పక్కనే ఉన్న అతని స్నేహితుడు ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన ఖాదర్‌వలి ఫోన్ తీసుకుని ఎందుకు తిడుతున్నావని ఫరూక్‌ను ప్రశ్నించాడు. దీంతో అతడిని కూడా బూతులు తిట్టి దమ్ముంటే కురుకుందలోని కొట్టాలచెరువు రోడ్డు వైపు రావాలని సవాల్ విసిరాడు. దీంతో వారు 10.30గంటలకు ఖాదర్‌వలి కురుకుంద వెళ్లగా అక్కడ ఖాదర్‌వలికి, ఫరూక్‌కు మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరిగి అప్పటికే తన వెంట తెచ్చుకున్న కత్తితో ఖాదర్‌వలి ఎడమ వైపు చాతిలో ఫరూక్ పొడవడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తండ్రి షేక్ మాలిక్ ఫిర్యాదు చేయడంతో ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై వెంకటనారాయణరెడ్డిలు విచారణ చేపట్టి నిందితుడైన గువ్వలకుంట్ల ఫరూక్‌ను శుక్రవారం కురుకుంద సమీపంలోని హైస్కూల్ వద్ద అరెస్టు చేశారు. కాగా పట్టుబడిన నిందితుడిని ఆత్మకూరు కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఎమ్మెల్యేకు టీడీపీ నాయకుల శుభాకాంక్షలు



విజయవాడలో ఎమ్మెల్యే గౌరు చరిత దంపతులను సత్కరిస్తున్న నాయకులు

పాణ్యం, జూన్ 21: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను శుక్రవారం విజయవాడలో మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి, రమణారెడ్డి, మనోహర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. మూడోసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఎమ్మెల్యేతోపాటు నందికొట్కూరు టీడీపీ ఇంచార్జి గౌరు వెంకటరెడ్డిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

అతిసార నియంత్రణకు చర్యలు తీసుకోండి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూన్ 21: అతిసార నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని, అతిసార నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అతిసార కేసుల వ్యాప్తి (స్టాప్ డయేరియా క్యాంపెయిన్)తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టరేట్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ చాంబర్ నుంచి కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో డయేరియా నియంత్రణ, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ

మిడుతూరు, జూన్ 21: మండలంలోని మాసపేట, చౌట్కూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన వ్యవసాయాధికారులతో మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన ఆదేశించారు. అనంతరం రైతులకు ఎరువులను అందజేశారు. వ్యవసాయాధికారి పీరునాయక్, టీడీపీ నాయకులు జయరామి రెడ్డి, వీరా రెడ్డి, రాజశేఖర రెడ్డి, రైతులు పాల్గొన్నారు. అలాగే మాసపేట సమీపంలో ఉన్న పెట్రోల్ బంకును జేసీ తనిఖీ చేశారు. తహసీల్దార్ తులశమ్మ, డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్, ఆర్ఐ బాషా, వీఆర్వో రాఘవేంద్ర పాల్గొన్నారు.

'గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వసతులు కల్పిస్తాం'

మహానంది, జూన్ 21: జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల కోసం పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకట శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై హెచ్ఎం అంబమ్మతో చర్చించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. అధికారి మాట్లాడుతూ మహానందిలోని పాఠశాలలో డార్మిటరీ శిథిలావస్థకు చేరిందని, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి నూతనంగా నిర్మించి విద్యార్థులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తామన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

కొత్తపల్లి, జూన్ 21: కొత్తపల్లి బీసీ బాలుర వసతి గృహంలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ షబ్బీర్ బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 3 నుంచి 10వ తరగతి వరకు 225 మంది విద్యార్థులను హాస్టల్‌లో చేర్చుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం అన్ని తరగతులకు కలిపి 142 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. హాస్టల్‌లో చేరాలనుకునే విద్యార్థులు జూలై 15లోగా తమ దరఖాస్తు ఫారాలను అందజేయాలని కోరారు. ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, జూన్ 21: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన వి.దీప్తి అనే భక్తురాలు కుటుంబసమేతంగా కలిసి రూ.లక్ష విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర్‌ప్రసాద్‌కు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్ర పటాన్ని అందజేసి సత్కరించారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ

శ్రీశైలం, జూన్ 21: శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీగిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల మహా మంగళ హారతుల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగింపుగా గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి లక్ష కుంకుమా ర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీశైలక్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా ఆర్జితసేవలలో పాలొనేందుకు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116 సేవా రుసుమును చెల్లించి పరోక్ష సేవలో పాలొనవచ్చును. కాగా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు మొత్తం 27 మంది భక్తులు ఈ సేవలో పాల్గొన్నారు. భక్తులు ఈ పరోక్షసేవ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు కోరారు. స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

'గిరిజనుల అభివృద్ధే టీడీపీ లక్ష్యం'

నంద్యాల రూరల్, జూన్ 21: గిరిజనుల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి డమాయత్ స్వామినాయక్ అన్నారు.అబాండంతండా గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన శుక్రవారం ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు.

విద్యార్థుల ప్రతిభ

పాణ్యం, జూన్ 21: ఎం.ఫార్మసీలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో శాంతిరాం విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి తెలిపారు. కె.తరుణ్‌కుమార్ ఏపీలో రాష్ట్ర స్థాయిలో 6వర్యాంకు, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. 8 మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాం, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్‌లు అభినందించారు.

చంద్రబాబును కలిసిన ఏరాసు





చంద్రబాబు, పవన్‌ను కలిసిన మాజీ మంత్రి ఏరాసు

ఆత్మకూరు, జూన్ 21: అమరావతిలోని అసెంబ్లీ భవనంలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం సందర్భంగా శుక్రవారం మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను వారివారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారికి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను కండువాలను కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఆకట్టుకున్న యోగాసనాలు

● ఘనంగా యోగా డే ● హాజరైన ప్రముఖులు ● యోగా ప్రాధాన్యంపై అవగాహన ● ఆసనాలు చేసిన విద్యార్థులు



నందికొట్కూరు(రూరల్): బ్రాహ్మణకొట్కూరులోని బాలుర సంక్షేమ హాస్టల్‌లో యోగాసనం చేస్తున్న విద్యార్థులు



శ్రీశైలంలో..



మహానంది వ్యవసాయ కళాశాల ఆవరణలో..

నంద్యాల (కల్చరల్), జూన్ 21: నంద్యాలలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యోగా ప్రతినిత్యం చేయడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడులను జయించవచ్చని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలి అని అన్నారు. నంద్యాలలో పలు స్వచ్ఛంద సంస్థలు, యోగాకేంద్రాలలో, ప్రభుత్వ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల పద్మావతీ నగర్‌లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ పార్కులో ఆయుష్ యోగా కేంద్రంలో ఆనంద్ గురూజీ నిర్వహణలో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, డాక్టర్ గెలివి సహదేవుడు, శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ నిర్వహించిన యోగా దినోత్సవం కార్యక్రమానికి ఎస్పీ రఘువీర్ రెడ్డి హాజరయ్యారు. క్రీడా భారతి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, రామక్రిష్ణా డిగ్రీకళాశాలలో కళాశాల అధినేత డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, నంద్యాల జిల్లా మెడికల్ కళాశాలలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్, బాల అకాడమీలో కరస్పాండెంట్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో, ఎల్‌కేఆర్ గ్లోబల్ స్కూల్, అమరయోగ వికాస కేంద్రంలో, యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ యశోధర, ఆయుష్ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానం శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చకులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఒంగోలుకు చెందిన చిన్నారులు రాధా రమణి, వల్లెపు ధనశ్రీ గణపతి ప్రార్థన, సరస్వతి ప్రార్థన, శివస్తోత్రాలకు నృత్యప్రదర్శన చేశారు. తరువాత శ్రీశైలప్రభ సంపాదకుడు అనిల్‌కుమార్ ప్రసంగిస్తూ యోగా వల్ల మనస్సు కట్టడి, శాంతి, బుద్ధి కలిగిస్తుందని పేర్కొన్నారు. యోగాచార్య గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం యోగాసనాల ప్రయోజనాలను వివరిస్తూ అందరిచేత చేయించారు. కార్యక్రమంలో చివర యోగా వీక్షకులందరికీ దేవస్థానం తరపున శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. దేవస్థానం అధికారులు, జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జిష్ణు నాగవిజయ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా శిక్షకుడు బ్రహ్మానంద, నాసిర్ హుసేన్‌లు అధ్యాపకులు, విద్యార్థులకు యోగా అభ్యాసనాలు చేయించారు. అధ్యాపకులు విద్యాసాగర్, పద్మావతిబాయి, శశిధరయ్య, సుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, తిరుపతమ్మ ఉన్నారు.

● యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగరాజు అన్నారు. ఆయా విద్యాసంస్థల్లో విద్యార్థులతో యోగా ఆసనాలను చేయించారు.

● ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతోనే యోగాకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించిందని బీజేపీ మహిళా మోర్చా జాతీయ నాయకురాలు మోమిన్ షబాన అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల నందు యోగాసనాలు చేశారు. కళాశాల కరస్పాండెంట్ సాయిప్రణీత్ ఉన్నారు.

మహానంది: మహానందిలోని అటవీ పర్యావరణ విద్యా కేంద్రం ఆవరణలో కర్నూలుకు చెందిన మహిళలు యోగాసనాలు చేసారు. మండలంలోని ఎంసీ ఫారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ బి. సరోజినీదేవి ఆధ్వర్యంలో విద్యార్థుల చేత యోగా టీచర్లు మహేశ్వరి, లక్ష్మీనారాయణలు పలు ఆసనాలు వెయ్యించి, సాధన చేయించారు. అలాగే మహానందిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో హెచ్ఎం అంబమ్మ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ఆసనాలు చేయించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాణా ప్రతాప్ పాల్గొన్నారు.



జూపాడుబంగ్లా: తరిగోపులలో..



గడివేములలో..



ఆత్మకూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

బండిఆత్మకూరు: పనులు చేసే కూలీలు సైతం ప్రతి రోజు యోగాసనాలు వేసి ఆరోగ్యవంతులుగా ఉండాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏపీవో వసుధ సూచించారు. అంతర్జాతీయ యోగా దినత్సవంలో భాగంగా పెద్దదేవళాపురం, శింగవరం, చిన్నదేవళాపురం గ్రామాల్లో ఉపాధి కూలీలతో యోగాసనాలు వేయించారు. ఈసీ వరదరాజులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు కోర్టు ఆవరణలో సీనియర్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని, మండల్ లీగల్ సర్వీస్ ఛైర్మన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా మాస్టర్ లింగన్న గౌడ్ యోగా క్లాస్ తీసుకొని యోగా గురించి అవగాహన కల్పిస్తూ యోగా ఆసనాలను వేయిస్తూ యోగ ద్వారా ప్రయోజనాల గురించి తెలియజేశారు. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

● నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డా.సునీత అధ్యక్షతన యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకులు భాస్కర్, రఘుపతిరెడ్డి, చిట్టెమ్మ, లైబ్రేరియన్ రవి, ఫిజికల్ డైరెక్టర్ ఆసిఫ్ బాషా పాల్గొన్నారు.

● నందికొట్కూరు అల్లాల సత్రంలో బీజేపీ కో ఆర్డినేటర్ చల్లా దామోదర్‌రెడ్డి యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీ నంది కాలేజ్, విజయవాణి స్కూల్, స్కాలర్ స్కూల్ విద్యార్థుల చేత యోగా ఆసనాలు వేయించారు. కర్నూలు లలితా పీఠం సద్గురువు మేడా సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకులు రామచంద్రుడు, కృష్ణ యాదవ్, కృష్ణకాంత్, సంజీవరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

● నందికొట్కూరులోని బైరెడ్డి నగర్‌లోని కోటా హైస్కూల్‌లో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులు యోగా ఆసనాలు వేశారు. మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్, ఉపాధ్యాయులు శారదమ్మ, సాలమ్మ, లలితమ్మ పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో బాలుర సంక్షేమ హాస్టల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యోగాసనాలు, దాని విసిష్టతను గురించి హాస్టల్ వార్డెన్ శ్రీనివాసనాయక్, డాక్టర్ వీరం మురళీధరరెడ్డి వివరించారు. విద్యార్థులు యోగాసనాలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

పాములపాడు: నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం పాములపాడులోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు కేజీబీవీ ఆవరణలో శుక్రవారం పాఠశాల ఎస్‌వో విజయలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. పీఈటీ సుమలత తదితరులు పాల్గొన్నారు.

పగిద్యాల: పగిద్యాల, ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత, ఎంపీపీ పాఠశాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. అలాగే విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు.

జూపాడుబంగ్లా: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని వెలుగు ఏపీఎం అంబమ్మ అన్నారు. మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగాడేను నిర్వహించారు.

వెలుగోడు: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కెనరా బ్యాంకు మేనేజర్ సూర్యదేవ నాయక్, నీలం సంజీవరెడ్డి డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఏపీ మోడల్‌స్కూల్ సరస్వతి శిశు మందిరంలో యోగాపై అవగాహన కల్పించి విద్యార్థులతో సూర్య నమస్కారాలు, ఆసనాలు చేయించారు. కార్యక్రమంలో సమితి సభ్యుడు చంద్రశేఖరరెడ్డి, శశికళ, హెచ్ఎం సుబ్రహ్మణ్యం, మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాణ్యం: పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, ఆయుష్ వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి, హెచ్ఎం మేరీసునీత, ఏపీవో విజయరాణి, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



పాములపాడులోని కేజీబీవీలో..

గడివేముల: మండలంలోని అన్ని పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగాసనాలు ప్రాణాయామం, సూర్య నమస్కారాలు చేశారు. గడివేముల హెచ్ఎం విక్టర్ ఇమానుయేల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు యోగాను అలవాటు చేసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నంద్యాల(కల్చరల్): నంద్యాలలో..



మిడుతూరు కేజీబీవీలో..



పగిద్యాల: ముచ్చుమర్రి జడ్పీ హైస్కూల్‌లో..



వెలుగోడులో..



పాణ్యంలో యోగా విన్యాసాలు



నందికొట్కూరులోని అల్లాల సత్రంలో..



బండిఆత్మకూరు: శింగవరం గ్రామంలో ఉపాధి కూలీలతో యోగాసనాలు వేయించిన అధికారులు

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం.. నాయకుల సంబరాలు

ఆత్మకూరు, జూన్ 21: శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బుడ్డా రాజశేఖరరెడ్డి శుక్రవారం అసెంబ్లీ భవనంలో శాసనసభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. వరుస క్రమంలో ఆయన పేరును పిలవగానే ముందుగా ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి ఆతర్వాత గౌరవప్రదంగా ప్రొటెం స్పీకర్‌ను కలిసి ప్రమాణ పత్రంపై సంతకం చేశారు. ఆతర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్, మంత్రి అచ్చెన్నాయుడులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిలావుంటే బుడ్డా రాజశేఖరరెడ్డి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడం పట్ల ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

బండిఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ శాసనసభలో శ్రీశైలం శాసనసభ్యుడిగా తమ అభిమాన నాయకుడు ప్రమాణం చేసిన వేళ మండల టీడీపీ శ్రేణులు ఆనందంతో మురిసిపోయారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బుడ్డా అభిమానులు టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయారు. తమ అభిమాన నేత ప్రమాణ వేళ రాగానే కేరింతలు, ఈలలు కొట్టారు.

శ్రీశైలం: శ్రీశైలంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు మహిషాసురమర్థిని అమ్మవారికి శుక్రవారం కొబ్బరికాయలు, గుమ్మడికాయలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రమాణస్వీకారం, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్‌కళ్యాన్ మొట్టమొదటి సారిగా అసెంబ్లీలో అడుగుపెట్టి ప్రమానస్వీకారం, బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మహిషాసురమర్థిని అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కొట్టి కూటమి శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. తరువాత జనసైనికులు కూటమి నాయకులతో కలిసి కేకు కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి రౌతు అశోక్‌కుమార్, టీడీపీ మండల నాయకుడు శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి సారిగా ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉంది. 25 ఏళ్ల తర్వాత నందికొట్కూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా అడుగుపెడుతుండడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ అదృష్టాన్ని, అవకాశాన్ని కల్పించిన నియోజక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



అసెంబ్లీలో నారా లోకేశ్‌కు కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా



శ్రీశైలంలో అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తున్న కూటమి నాయకులు

'జిల్లా కేంద్రంలో 3 అన్న క్యాంటీన్లు'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 21: నంద్యాల జిల్లా కేంద్రంలో 3 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, ఎన్టీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సమీపంలో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ల పనులను ఫిరోజ్ శుక్రవారం పరిశీలించారు. అధికారులతో ప్రస్తుత పరిస్థితి, పెండింగ్ పనుల గురించి ఆయన తెలుసుకున్నారు. వచ్చే క్యాబినెట్ సమావేశంలో అన్నా క్యాంటీన్ల పునః ప్రారంభంపై ఆమోద ముద్ర రాగానే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వెలుగోడు, జూన్ 21: వెలుగోడు పట్టణంలోని కీర్తి నగర్‌కు చెందిన ఓ వ్యక్తి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. సీపీనగర్‌లో నివసా ముంటున్న సుధాకర్(50) తాగుడుకు బానిసై అనారోగ్యంతో బాద పడుతుండేవారు. శుక్రవారం సైతం ఇంట్లో కుటంబ సభ్యులు లేని సమయంలో కడుపు నొప్పి తాళలేక మద్యంతో పాటు కలుపు మొక్కల నివారణ మందును కలుపుకుని తాగారు. ఇంట్లో వాంతులు చేసుకుని పడి ఉన్నాడు. కూలీ పనులకు వెళ్లి వచ్చిన సుధాకర్ భార్య సుధాకర్‌ను చూసి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాలకు తరలించారు. నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. సుధాకర్ భార్య సోమేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. సుధాకర్‌కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వృద్ధురాలిని ఢీకొట్టిన బస్సు

శ్రీశైలం, జూన్ 21: శ్రీశైలం మండలంలోని సుండిపెంట గ్రామంలో ఓ వృద్ధురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. సుండిపెంట గ్రామంలోని బస్‌స్టాండ్ ప్రాంగణంలో జరిగిన ఈ ఘటనలో పిచ్చమ్మ అనే వృద్ధురాలు కుడికాలు చితికిపోయింది. ఘటనా స్థలంలో ఉన్న స్థానికులు గాయపడ్డ వృద్ధురాలిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమెను ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట వైద్యశాలకు రిఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత

జిల్లాలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని సొంత చేసుకోవచ్చని వక్తలు అన్నారు. యోగాసనాల ప్రయోజనాలను వివరిస్తూ సూర్య నమస్కారాలు సాధన చేయించారు. ఒత్తిడిని అధిగమించి మానసిక ప్రశాంతతను పొందవచ్చునని తెలిపారు. చిన్నారులు యోగాసనాలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.


దొర్నిపాడు జడ్పీహెచ్ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు


అవుకు అంగన్‌వాడీ కేంద్రంలో...


కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా చేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు


చాగలమర్రి కస్తూర్బా పాఠశాలలో..


సంజామల జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు


బనగానపల్లె కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న జడ్జి, న్యాయవాదులు


రుద్రవరంలో...


ప్యాపిలిలో...


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు


చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో యోగా చేస్తున్న ఎంఈవోలు, విద్యార్థులు


శిరివెళ్ల మోడల్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు


బేతంచెర్ల మండలం గోర్లగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ..


ఉయ్యాలవాడ మాయలూరు ఉన్నత పాఠశాలలో...

పుణ్యక్షేత్రాల కారిడార్ ఏర్పాటు చేయాలి


స్వామివారికి పూజలు చేస్తున్న బైరెడ్డి

ఆళ్లగడ్డ, జూన్ 21: తిరుపతి-శ్రీశైలం పుణ్యక్షేత్రాలను కలుపుతూ నల్లమల ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పుణ్యక్షేత్రాల దర్శనం కారిడార్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి కోరారు. నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన అహోబిలం క్షేత్రాన్ని శుక్రవారం ఆయన దర్శించుకొని పూజలు చేశారు. ఈయన ఎగువ అహోబిలంలోని లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌ను, దిగువ అహోబిలంలోని ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. తన కుమార్తె బైరెడ్డి శబరి నంద్యాల ఎంపీగా ఎన్నిక కావడంతో మొక్కు తీర్చుకున్నానని బైరెడ్డి తెలిపారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి


రుద్రవరం మండలం పెద్దకంబలూరులో పొలాన్ని దున్నుతున్న నాయకులు

రుద్రవరం, జూన్ 21 : మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏరువాక పౌర్ణమి సంబరాలు నిర్వహించారు. సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ పాడిపంటలతో రైతులు లాభాల బాటలో పయనించాలని కోరారు. అంతేకాకుండా 50 ఏళ్ల దాటిన ప్రతి సన్న చిన్న కారు రైతులకు రూ.5వేలు పింఛను ఇవ్వాలని, ఆధునిక వ్యవసాయ పరికరాలు, పంట కోత యంత్రాలు 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లాసహాయ కార్యదర్శి భాస్కర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, మోటరు రాముడు, నందికొట్కూరు రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, బనగానపల్లె నాయకుడు సుబ్బారెడ్డి, బాలనరసింహుడు తదితరులు పాల్గొన్నారు

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్


వైసీపీ కౌన్సిలర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న భార్గవ్‌రామ్‌నాయుడు

ఆళ్లగడ్డ, జూన్ 21: ఆళ్లగడ్డ మున్సిపాల్టీలోని పి.చింతకుంట 1వ వార్డు వైసీపీ కౌన్సిలర్ గురివిగాళ్ల లక్ష్మీనరసింహుడు ఎమ్మెల్యే అఖిలప్రియ భర్త భార్గవ్‌రామ్‌నాయుడు సమక్షంలో శుక్రవారం చేరారు. తాము వైసీపీ తరపున గెలిపినప్పటికీ ప్రజల సమస్యలను పరిష్కరించలేకపోయామని కౌన్సిలర్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పి.చింతకుంట టీడీపీ నాయకుడు జాఫర్‌రెడ్డి, పట్టణ 20వ వార్డు కౌన్సిలర్ హుసేన్‌బాషా, నాగిరెడ్డిపల్లె శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు వైసీపీ కౌన్సిలర్లు నల్గురు టీడీపీలో చేరటంతో టీడీపీ కౌన్సిలర్ సంఖ్య 8కి చేరింది.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 21: అతిసార పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో అతిసార మాసోత్సవంపై అవగాహన కల్పించారు. కరపత్రాలు చేతపట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ జూలై 17 వరకు గ్రామాల్లో అతిసార నియంత్రణ మాసోత్సవాలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లీలావతి, సీహెచ్‌వో సమత, ఆశా వర్కర్లు పెద్దక్క, సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్ రజిని, హెల్పర్ పద్మావతి పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి


రెవనూరు హుసేన్‌సావలి దర్గా వల్ల ప్రార్థనలు చేస్తున్న నాయకులు

చాగలమర్రి, జూన్ 21: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల మండలంలోని రెవెనూరు గ్రామంలో వెలసిన హుసేన్‌సావలి దర్గాలో శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. టీడీపీ నంద్యాల మైనార్టీసెల్ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి ఏర్పాటు చేసిన శుభకార్యక్రమంలో ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ పాల్గొన్నారు. ఆయనకు శాలువ, పూలమాలలతో సన్మానించారు. అనంతరం దర్గాలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌళాలి, మాబులాల్, జెట్టి నాగరాజు, రఫిద్దిన్, బాషా, అబ్దుల్ ఖాదర్, అజీమ్, గఫార్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కోట్ల.. అనే నేను...

- తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
- డోన్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం
- చంద్రబాబు, పవన్, లోకేశ్‌ల ఆత్మీయ పలకరింపు


అసెంబ్లీలో సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్‌లతో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి





డోన్, జూన్ 21: కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అనే నేనూ అంటూ.. డోన్ ఎమ్మెల్యేగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి తనయునిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తన రాజకీయ జీవితాన్ని ఎంపీతోనే ప్రారంభించారు. 1991లో తొలిసారి కర్నూలు ఎంపీగా కోట్ల గెలిచి లోక్‌సభలో అడుగు పెట్టారు. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో కర్నూలు ఎంపీగా గెలిచారు. 2012లో అప్పటి యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పని చేశారు. ఆ తర్వాత 2014, 2019 ఎన్నికల్లోనూ ఎంపీగా పోటీ చేసి ఓటమి పొందారు. సుదీర్ఘ తన రాజకీయ జీవితంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తొలిసారిగా ప్రస్తుత ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ బరిలో నిలిచారు. టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేసి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి డోన్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.

● తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టిన కోట్ల:
డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తొలిసారి ఏపీ అసెంబ్లీలో శాసన సభ్యునిగా అడుగు పెట్టారు. తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏపీ శాసనసభలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యేగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ అసెంబ్లీలో ప్రత్యేక ముద్ర వేసుకున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిపై గెలుపొందిన డోన్ ఎమ్మెల్యే కోట్లకు అసెంబ్లీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లు కోట్లతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆత్మీయ పలకరింపుతో శాసనసభలో మాట్లాడటం అందరి దృష్టిని ఆకర్షించింది.

● ఎంతో సంతోషంగా ఉంది
- డోన్ ఎమ్మెల్యే కోట్ల :
మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టడం ఎంతో సంతోషంగా ఉంది. కూటమి నాయకులు, కార్యకర్తల కష్టమో, ప్రజల ఆశీస్సులతో డోన్ ఎమ్మెల్యేగా గెలిచాను. అసెంబ్లీలో నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే అవకాశం లభించింది. మా నాన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి చూపిన బాటలో నడుస్తూ ప్రజల ఆశయాలను నెరవేర్చేలా పని చేస్తా.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం


డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్న కార్యకర్తలు

డోన్, జూన్ 21: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదే విదంగా రోగులకు, పిల్లలకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూర్యప్రకాష్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా శివశంకర్ గౌడు

డోన్, జూన్ 21: డోన్ రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షునిగ శివశంకర్‌గౌడు, సెక్రటరీగా మల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని రోటరీ భవన్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ చిన్నపరెడ్డి హాజరవుతారని తెలిపారు.

ధర్మప్రచారం అందరి బాధ్యత

చాగలమర్రి, జూన్ 21: ధర్మప్రచారం అందరి బాధ్యతని శివరామానంద ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి అన్నారు. శుక్రవారం చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో హిందూ సమాజం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాంతియుత జీవనం అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

రుద్రవరం, జూన్ 21 : సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఈవోపీఆర్‌డి శ్రీనివాసశర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని నరసాపురం సచివాలయాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం నియమించిన సమయపాలనలో రిజిస్టరులో తప్పనిసరిగా సంతకాలు చేయాలన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

రుద్రవరం, జూన్ 21 : పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని శ్రీనివాసశర్మ అన్నారు. సికిల్‌సెల్ వ్యాధి లక్షణాలు నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ సమతుల్య ఆహారంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని అన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

బేతంచెర్ల, జూన్ 21: మండలంలోని వివిధ గ్రామాల్లో పట్టణంలో ప్రైవేటు పాఠశాలలు నిర్వహించే యజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని మండల విద్యాధికారి సోమశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాల నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులు, పుస్తకాలు, దుస్తలు విక్రయాలు కొనసాగిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల నిర్వహకులు ఎంఈవో కార్యాలయ సిబ్బంది సురేష్, కిషోర్, ఆచారి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కోట్లకు మంత్రి పదవి ఇవ్వాలి

డోన్(రూరల్), జూన్ 21: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని వెంకటనాయునిపల్లె గ్రామ టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. సమావేశంలో వెంకటనాయునిపల్లె గ్రామ టీడీపీ అభిమానులు కొమ్ము మాధవకృష్ణ, రామయ్య, లక్ష్మయ్య, మద్దయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 21: కొలిమిగుండ్లలోని గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టామని ఎంపీడీవో సాయిక్రిష్ణ వెల్లడించారు. జనసేన నాయకులు గుజ్జల పెద్దయ్య, వెంకటరమణ, రామూర్తి తదితరుల విజ్ఞప్తి మేరకు ఎంపీడీవో కొలిమిగుండ్ల గ్రంథాలయాన్ని సందర్శించారు. త్వరలో నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్య ప్రాధాన్యతను తెలియజేయండి

డోన్(రూరల్), జూన్ 21: విద్య యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించాలని డోన్ ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం సూచించారు. మండలంలోని ధర్మవరం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో డోన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే గ్రాడ్యుయేషన్ డేను పురస్కరించుకుని చిన్నారులు గ్రాడ్యుయేట్ దుస్తులతో అలరించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్త జులైఖ, అంగన్‌వాడీ వర్కర్ రమాదేవి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్యాపిలి, జూన్ 21: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు అన్నారు. గ్రీన్ లైఫ్ కార్యక్రమంలో బాగంగా శుక్రవారం పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామపంచాయితీ కార్యలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పుర వీధుల గుండా సాగింది. అనంతరం ఈవోఆర్డీ మాట్లాడుతూ చెట్ల ద్వారానే అనేక జీవరాసులు జీవనం సాగిస్తున్నాయన్నారు. కాబట్టి అడవులను సంరక్షించుకోవాని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈవో శివకుమార్, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు వేలం ద్వారా రూ.14 లక్షల ఆదాయం

శిరివెళ్ల, జూన్ 21 : మండలంలోని బోయలకుంట్ల గ్రామంలో వెలసిన ఆలయాలకు దేవాదాయశాఖ అధికారులు శుక్రవారం నిర్వహించిన కౌలు వేలంపాటలు పోటాపోటీగా జరిగాయి. రామేశ్వర, వీరభద్ర, అనంతపద్మనాభ స్వామి, ఆంజనేయ, వేణుగోపాల, నరసింహ స్వామి ఆలయాలకు చెందిన 66.15 ఎకరాల భూములకు గత ఏడాది రూ.11.14 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రైతుల నుంచి పోటీ అధికమవ్వడంతో రూ.2.93 లక్షల ఆదాయం పెరిగి మొత్తం రూ.14.07 లక్షల ఆదాయం సమకూరినట్లు కోటపాడు గ్రూపు దేవాలయాల ఈవో గంటా వేణునాథరెడ్డి తెలిపారు. దేవాదాయ శాఖ బనగానపల్లె డివిజన్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఈ వేలంపాటలకు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ సహాయకుడు మేరువ శివ నాగిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యర్రగుంట్లలో ఆలయ భూములకు కౌలు వేలం

శిరివెళ్ల, జూన్ 21 : మండలంలోని యర్రగుంట్లలో వెలసిన ఆలయాలకు చెందిన భూములకు 24న బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు గ్రూపు దేవాలయాల ఈవో బీవీ నరసయ్య శుక్రవారం తెలిపారు. ఇందులో రామస్వామి ఆలయానికి చెందిన 21.16 ఎకరాల భూములకు, ఈశ్వర స్వామి ఆలయానికి చెందిన 22.24 ఎకరాల భూములకు, చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 25.8 ఎకరాల భూములకు కౌలువేలం నిర్వహిస్తున్నామన్నారు. 2024-25కు గాను ఏడాది కాలపరిమితితో నిర్వహిస్తున్న ఈ కౌలు వేలంపాటలో పాల్గొనేందుకు ఆసక్తి కలగిన రైతులు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలని ఈవో వెల్లడించారు.

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన బీసీ


అసెంబ్లీలో ముందు వరుసలో కుర్చున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 21 : బనగానపల్లె నియోజకవర్గం ఎమ్మెల్యేగా శుక్రవారం ఏపీ అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. రెండోసారి ఎమ్మెల్యేగా బనగానపల్లె నియోజవకర్గం నుంచి ఎంపికయ్యారు. బీసీ జనార్దన్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖామంత్రిగా గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలో పొటెం స్పీకర్ బుచ్చెయ్య చౌదరి ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేశారు. బీసీ జనార్దన్ రెడ్డి దైవసాక్షిగా అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు.

● మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మరియు విద్యాశాఖామంత్రి నారాలోకేశ్‌ను కలిశారు. నారా లోకేశ్‌తో కలిసి బీసీ అసెంబ్లీ సమావేశాలకు వెళ్లారు. వీరితో పాటు పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అసెంబ్లీకి బయలు దేరి వెళ్లారు.

నాయకుల సంబరాలు


టీడీపీ నాయకులు వంగల పరమేశ్వరరెడ్డి, టంగుటూరు శ్రీనయ్యలను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె , జూన్ 21 : మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బనగానపల్లెలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకుడు వంగల పరమేశ్వరరెడ్డి, జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్యలను పలువురు టీడీపీ శ్రేణులు అభినందించారు. స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, లాయర్ నాగేంద్రారెడ్డి, తిరుమలయ్య, ఖాదర్, మల్లారెడ్డి, కోడినగేశ్ బాబు, బాలపుల్లయ్య, వేణుగోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోట్ల ప్రమాణ స్వీకారానికి తరలి వెళ్లిన నాయకులు


అమరావతిలో ఎమ్మెల్యేగా కోట్లకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

డోన్, జూన్ 21: అమరావతిలోని అసెంబ్లీలో డోన్ ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి శుక్రవారం డోన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన కోట్లను టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, ప్రభాకర్ రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు.

కిరాణా షాపు బాధితులకు ఆర్థిక సాయం

కోవెలకుంట్ల, జూన్ 21: కోవెలకుంట్లలోని స్వామినగర్‌కు చెందిన కిరణ్ దంపతులు ఎంపీడీవో ఆఫీసు ముందు కిరాణ షాపు బంకు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన గాలి వానకు షాపు పక్కనే ఉన్న గోడ కూలి బంకు పూర్తిగా కూలిపోయింది. దీంతో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. విశ్రాంత గ్రంథాలయ అధికారి, ప్రకృతి పీఠం నిర్వాహకులు పల్లె నరసింహారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రాములమ్మ, పెయింటర్ సుబ్బయ్య, సీపీఎం నాయకులు సుధాకర్ స్పందించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేశ్, శివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

జీఎం టాకీస్ మేనేజరు దస్తగిరి బాషా మృతి


దస్తగిరిబాషా కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె , జూన్ 21 : బనగానపల్లె పట్టణంలోని జీఎం టాకీస్ మేనేజరు దస్తగిరిబాషా(56) శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందాడు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ దస్తగిరిబాషా భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే జీఎం టాకీస్ యజమాని మహబూబ్‌పీరా అధిక సంఖ్యలో ప్రజలు దస్తగిరిబాషా మృతికి సంతాపం తెలిపారు.

మంత్రి సవితను కలిసిన నాయకులు


మంత్రిని కలిసిన నాగేశ్వర రావు యాదవ్, నాయకులు

ప్యాపిలి, జూన్ 21: రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను శుక్రవారం అమరావతిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన బీసీ సమస్యలపై మంత్రితో మాట్లాడినట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మద్దులేటి, చల్లా అనుదీప్ మంత్రిని కలసిన వారిలో ఉన్నారు.